క్లుప్తంగా

పాఠశాలను సందర్శించిన డీఈవో



వివరాలు తెలుసుకుంటున్న డీఈవో

జైపూర్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి యాదయ్య సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు, డ్రాపౌట్ విద్యార్థుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డ్రాపౌట్ విద్యార్థుల పేరెంట్స్ మొబైల్ నంబర్ తెలుసుకుని, వారికి కాల్ చేసి విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం మండల ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. హెచ్ఎం ఆలీస్ మాధుర్య, జిల్లా ప్రత్యేక అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

మంచిర్యాల తహసీల్దార్‌గా ప్రసాద్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల తహసీల్దార్‌గా కె.వై.ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మంచిర్యాల తహసీల్దార్‌గా ఉన్న రాజేశ్వర్‌కు జిల్లా కలెక్టరేట్ ఏవోగా బదిలీ కాగా, కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రసాద్‌ను మంచిర్యాలకు కేటాయించారు.

‘ఓటమి భయంతోనే ఫ్లెక్సీలు తొలగింపు’

మందమర్రిరూరల్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతుందనే భయంతోనే పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు తొలగించారని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజారమేష్ ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు చింపిన వారిని వెంటనే గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కదారి జీవన్‌కుమార్, నాయకులు పాషా, రామస్వామి, సుధీర్, హరీష్, రంగనాథ్, హరి తదితరులు ఉన్నారు.

‘కేసీఆర్ రైతుల పక్షపాతి’

మందమర్రిరూరల్: సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామాన్ని శనివారం సందర్శించి, ఆ గ్రామ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్యతో కలిసి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేయడంపై ముఖ్యమంత్రిని అభినందిస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఉప సర్పంచ్ స్వరూప, బీఆర్ఎస్ నాయకులు విజయ, రాంచందర్, రాజయ్య, మల్లేష్, నగేష్, రోజా తదితరులు ఉన్నారు.

‘బీజేపీని ఆదరించాలి’

రామకృష్ణాపూర్: పట్టణంలోని బీజోన్ శ్రీనివాసనగర్, అబ్రహాంనగర్‌లలో శనివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో నరేంద్రమోడీ పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న బీఆర్ఎస్‌కు చరమగీతం పాడి, రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, ఆరుముళ్ల పోషం, వేముల అశోక్, బంగారు ప్రసాద్, శ్యాం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జీపీ భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

కాసిపేట: మండలంలో మంజూరైన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీడీవో ఎంఏ అలీం సూచించారు. మండలంలోని చిన్నదర్మారం, మల్కేపల్లి, రొట్టెపల్లి, సోనాపూర్, దేవాపూర్ మద్దిమాడ గ్రామపంచాయతీల్లో శనివారం భవననిర్మాణాల పనులను పరిశీలించారు.

జూట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బెల్లంపల్లి: పెర్కలకు జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం వెంటనే జూట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి మండల పెర్కసంఘం నాయకులు డిమాండ్ చేశారు. షంషీర్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు.

తహసీల్దార్‌కు సన్మానం

జన్నారం: విధి నిర్వహణలో సేవలందిస్తూ అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తూ మచ్చలేని లేని వ్యక్తిగా తహసీల్దార్ కిషన్ పేరు తెచ్చుకున్నారని ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. బదిలీపై వెళ్తున్న కిషన్‌కు వివిధ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల నాయకులు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం

పాతమంచిర్యాల: భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఏర్పాటై 20ఏళ్లు గడిచిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.



ముత్యంపేటలో



దండేపల్లిలో డూప్లెక్స్ ఇల్లు



నెర్మివెంకటాపూర్‌లో...



సంబాలలో..

పల్లెకు పట్నం సొబగులు

దండేపల్లి: పల్లె మును‘పల్లె’ లేదు.. ఒకప్పుడు పల్లె అంటే పూరిగుడిసెలు, లేకుంటే పెంకుటిళ్లు, కాకుంటే రెండు గదుల దాబాలు, పల్లెల్లో నివాస గృహాల గురించి ఇంతకు మించి పెద్దగా చెప్పుకోరాదు. ఇవన్నీ ఒకప్పటి మాట. ఇప్పటి పల్లెసీమలు, ఇళ్ల నిర్మాణాల్లో మాత్రం పట్టణాలను తలపిస్తున్నాయి. పల్లెలో నిర్మించే ఇళ్లకు రూ.50లక్షల నుంచి, కోటి వరకు వెచ్చిస్తున్నారు. దీంతో పల్లెల్లో పూరిగుడిసెలు కనుమరుగై, డూప్లెక్సు ఇళ్లు, అద్దాలమేడలు, బహుళ అంతస్తుల భవనాలు దర్శనమిస్తున్నాయి.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



అశోక్‌రోడ్డు 2లో తల్లిపాల విశిష్టతను వివరిస్తూ..



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సృజన



అక్షరాభ్యాసం చేయిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచులు

బెల్లంపల్లి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని బెల్లంపల్లి మండలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సృజన అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 65 డీప్-1, శాంతిఖని-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతల ఇళ్లను సందర్శించి అంగన్‌వాడీ బుక్‌లోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, లక్ష్మి, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు 2అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ బి.విజయలక్ష్మి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్ఠతను వివరించారు. ఆయా మంజుల, ఆర్పీ వాసవి పాల్గొన్నారు. ఏసీసీ 3అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీని అంగన్‌వాడీ టీచర్ పద్మ, సహాయకురాలు లత నిర్వహించారు.

జన్నారం: మండలంలోని పొనకల్, మురిమడుగు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన, అక్షరభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ భూమేశ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, కవిత పాల్గొన్నారు.

ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి..?

- బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలోకి వస్తే ఏడాదికి 2కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ విమర్శించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో ఒక్కరికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. నిరుద్యోగుల గోస పట్టించుకోకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ రాష్ట్రంలో జనరంజకమైన పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం అర్థరహితమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై నాయకులు సన్నీబాబు, కిరణ్, యూనిస్, యాసిన్, శాంతకుమార్, రాజు, వినయ్, వెంకటేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

31వ రోజుకు కార్మికుల సమ్మె

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మందమర్రిరూరల్: మల్టీపర్పస్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 31వ రోజుకు చేరింది. సీఎం కేసీఆర్ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మందమర్రిలో జీపీ ఉద్యోగుల దీక్షకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం బాస్కర్ సంఘీభావం ప్రకటించారు.

‘గడపగడపకూ కాంగ్రెస్’



ఎల్ఐసీ కాలనీలో పర్యటిస్తున్న సురేఖ

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో శనివారం మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చొప్పదండి దుర్గాభవానీ గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూరిబాబుతో కలిసి ముందస్తుగా కాంగ్రెస్‌పార్టీ విడుదల చేసిన రైతు, యూత్ డిక్లరేషన్ ప్రతులను విడుదల చేశారు. ఆ తర్వాత మున్సిపాలిటీలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కాంగ్రెస్ రైతు, యూత్ డిక్లరేషన్ ప్రతులను అందజేసి, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు చేపట్టబోయే కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు.

చెన్నూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని అస్నాద, అక్కెపల్లి గ్రామాల్లో శనివారం బైక్‌ర్యాలీ, పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో రాజమల్లాగౌడ్, బాపాగౌడ్, రాజేందర్, నాయకులు రాజయ్య, సర్వేష్, బీరేష్, తిరుపతి, రాయమల్లు, మహేందర్, కిరణ్ పాల్గొన్నారు.

గడపగడపకూ పీఎస్సాఆర్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 21వ వార్డు ఎల్ఐసీ కాలనీలో గడపగడపకూ పీఎస్సాఆర్‌లో భాగంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సురేఖ శనివారం పర్యటించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతిని ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక

బెల్లంపల్లి: పట్టణ కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో శనివారం మున్సిపాలిటీలోని 4, 19వార్డులకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ నాయకులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు రాము, వజీర్, రాజారత్నం, ప్రతాప్, గౌస్, రాజలింగు, శ్రీనివాస్, నరేందర్, రియాజ్, వినయ్, రవి పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే మంచి లక్షణాలు అలవర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

మందమర్రిరూరల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకోవాలని మందమర్రి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎలాంటి వేధింపులకు లోనైనా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా సమాజంలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చుపడొద్దని జాగ్రత్త వహించాలని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్, ఏఎస్సై మల్లేశం, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత, సిబ్బంది ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సీసీసీ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు ‘భారత దేశ స్వాతంత్ర్య పోరాటం’ అనే అంశంపై శనివారం ప్రసంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రమేశ్, పార్వతి, షమినాబేగం, సంపత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘491క్వార్టర్ స్వాధీనం చేసుకోవాలి’

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని మొదటి జోన్‌లోని 491క్వార్టర్ కబ్జాకు గురై అక్రమ నిర్మాణం జరుగుతుందని, వెంటనే సంబంధిత అధికారులు ఆ క్వార్టర్‌ను స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణం జరగకుండా చూడాలని శనివారం టీఎస్టీయూసీ ప్రధానకార్యదర్శి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన క్వార్టర్లను శనివారం ఆయన సందర్శించారు. యాజమాన్యం వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని, సింగరేణి ఆస్తులను కాపాడాలన్నారు. ఆయన వెంట నాయకులు లక్ష్మీరాజం, వాసాల సంపత్, కారం రాజు, సత్యనారాయణ, తాజొద్దీన్ ఉన్నారు.

పొన్నారంలో తాగునీటికి అవస్థలు



పొన్నారంలో పనిచేయని బోరు

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామ పంచాయతీలో పలు కాలనీల్లో సుమారు నెల రోజులుగా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విషయం చెప్పినా పట్టించుకోవడం లేదని ఆ కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. పొన్నారం గ్రామంలో ఎస్సీ కాలనీలో సుమారు 30–40ఇళ్లకు నెల రోజుల క్రితం తాగునీటిని సరఫరా చేసే బోరు చెడిపోయి, వాటర్ సరఫరా నిలిచిపోయింది. సురి మిళ్ల రాజయ్య ఇంటిదగ్గర వాటర్ సరఫరా చేసే పైపులైన్ చెడిపోవడంతో అటువైపు తాగునీరు సరఫరా అయ్యే ఇళ్లకు కూడా సరఫరా నిలిచిపోయింది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా మరమ్మతు చేయించడం లేదని వాపోతున్నారు. వెంటనే మరమ్మతు చేయించి, తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి హరీష్‌ను వివరణ కోరగా బోరు, పైపులైన్ మరమ్మతు పనులు చేయిస్తానని తెలిపారు.

రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్‌గాంధీపై పెట్టిన పరువు నష్టం కేసులో విధించిన రెండేళ్ల జైలుశిక్ష అమలు కాకుండా స్టే విధించి, పార్లమెంట్ సభ్యత్వాన్ని పునఃరుద్ధరించేలా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ శనివారం బెల్లంపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్‌లోని రెండువర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. రాహుల్‌గాంధీ తిరిగి పార్లమెంట్‌లో అడుగుపెడుతుండటం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు కంకటి శ్రీనివాస్, ముచ్చర్ల మల్లయ్య, ప్రభాకర్, శారద, మల్లేష్, మహేందర్, గుజ్జ రవి, ఎండి అఫ్జల్, శ్యామ్, రాము, లక్ష్మణ్, శ్రీనివాస్ యాదవ్, ఓజియార్, మేకల శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నస్పూర్: ప్రతీ మహిళ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ రాధాకుమారి తెలిపారు. ఇల్లందు క్లబ్‌లో శనివారం డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో లేడీస్‌క్లబ్ సభ్యులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ, బీపీ, షుగర్ హిమోగ్లోబిన్, హార్ట్ ఎటాక్, తదితర వాటిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడడంలో మహిళల పాత్ర ముఖ్యమైనది అని తెలిపారు. డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ మహిళలపైనే ఆధారపడి ఉంటుందని మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేత



బహుమతి అందజేస్తున్న అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్మికులకు శనివారం గనిపై జరిగిన కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, ఎస్ఓఎం స్వామిరాజు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పని స్థలాల్లో రక్షణతో కూడిన నియమాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కొట్టె రమేశ్, పిట్ కారదర్శి జంపయ్య, పిట్ ఇంజినీర్ రాజగోపాలాచారి, వెంటిలేషన్ అధికారి శంకర్, అధికారులు విశ్వేశ్వర్ రావు, సాత్విక్, కార్మికులు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

కాసిపేట: రక్షణ చర్యలు విస్మరిస్తున్న సింగరేణి అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. గనిలో సరైన వెంటిలేషన్ సౌకర్యాలు లేకుండా, కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గని ఆవరణలో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రదీప్‌కుమార్, కేంద్ర కమిటీ సభ్యుడు మాదాసు రవీందర్, పిట్ కార్యదర్శి మాసాడి రవీందర్, జాయింట్ సెక్రెటరీ వీరన్న, స్వామి, వెంకటేష్ తదితరులున్నారు.

అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

- పల్లెల్లో దోమల స్వైరవిహారం
- వ్యాధుల బారినపడుతున్న జనం
- నిధుల లేమితో కొరవడిన నిర్వహణ



ఫాగింగ్ యంత్రం

జన్నారం: అసలే వర్షాకాలం..ఆపై సీజనల్ వ్యాధులు..దీనికితోడు పల్లెల్లో పారిశుధ్య లోపంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో దోమల నివారణ కోసం గతంలో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. అయితే వీటి నిర్వహణ లేక మూలనపడటం, నిధుల కొరత, మరమ్మతులకు సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చాలా పంచాయతీల్లో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా పల్లెల్లో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో జనం వ్యాధుల బారినపడుతున్నారు.

29 జీపీల్లో యంత్రాలు

దోమల నియంత్రణకు జన్నారం మండలంలో 29 జీపీల్లో పంచాయతీ నిధులతో ఫాగింగ్ యంత్రాలను గతంలో కొనుగోలు చేశారు. ఒక్కో యంత్రానికి సుమారు రూ.50 వేల వరకు వెచ్చించారు. పెట్రోల్, డీజిల్‌ను వినియోగించి దోమల నివారణకు పారిశుధ్య సిబ్బంది ఫాగింగ్ చేసేవారు. గ్రామం మొత్తం ఫాగింగ్ చేసిన ప్రతిసారి రూ.5 వేల ఖర్చవుతుంది. కొంతకాలం వరకు బాగానే పనిచేసిన యంత్రాలు, తర్వాత మొరాయించాయి. మరమ్మతుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిధుల లేమితో మరమ్మతు చేయించలేకపోవడం, మరమ్మతు చేసేవారు అందుబాటులో లేకపోవడంతో యంత్రాలు మూలనపడ్డాయి. యంత్రాలకు మరమ్మతు చేసేవారు జిల్లాలో లేరని, హైదరాబాద్ నుంచే రావల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వారి కోసం సర్పంచులు ఎదురుచూస్తున్నారు. 29 పంచాయతీలకుగాను కేవలం నాలుగు ఫాగింగ్ యంత్రాలు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. యంత్రాలు కేవలం వర్షాకాలం సీజన్‌లో వాడటం వల్ల పాడైపోతున్నట్లు తెలుస్తుంది. యంత్రాలు మరమ్మతు చేపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిధుల కొరత..

జీపీల్లో నిధుల కొరత సమస్య వెంటాడుతోంది. బిల్లుల చెల్లింపు ప్రక్రియా తరచూ నిలిచిపోవడంతో పాలకులు, అధికారులు, ఫాగింగ్ యంత్రాల మరమ్మతుపై దృష్టిసారించడం లేదు. ఒక్కోసారి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు సర్పంచులు వాపోతున్నారు. ఆ కారణంగా ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతు చేయించలేకపోతున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

సర్దుబాటు చేసుకోవాలి

మండలంలో కేవలం నాలుగు యంత్రాల వరకు పని చేస్తున్నాయి. ఓ గ్రామంలో ఫాగింగ్ చేసిన అనంతరం మరో పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లి సర్దుబాటు చేసుకోవాలని ఆదేశించాం. ప్రస్తుతం పొనకల్ మేజర్ పంచాయతీ వారు మరమ్మతుకు పిలిపించారు. త్వరలో అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ చేయిస్తాం.

– అరుణరాణి, ఎంపీడీవో

బీవైఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌యాదవ్

జైపూర్: భారత యాదవ సమితి(బీవైఎస్) మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా జైపూర్ మండలంలోని ఇందారంకు చెందిన చేగొండ శ్రీనివాస్‌యాదవ్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్‌యాదవ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ సభ్యులకు, సహకరించిన జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగన్న, మహిళా అధ్యక్షురాలు పద్మ, తిరుపతిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లాలో సమితి బలోపేతానికి కృషి చేస్తానన్నారు.